# క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ
- క్రైస్తవ మహిళలకు కనుకలు అందజేత

అందోల్, డిసెంబర్ 24: క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సంతోషంగా జరుపుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఆదివారం రాత్రి జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రైస్తవులకు ఎంతో విశిష్టమైన క్రిస్మస్ పండుగను సుఖసంతోషాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి మంత్రి చేత క్రిస్మస్ కేక్ కట్ చేయించారు. అనంతరం క్రైస్తవ మహిళలకు ప్రభుత్వం అందించిన క్రిస్మస్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, కౌన్సిలర్లు రంగ సురేశ్, చిట్టిబాబు, రేఖ ప్రవీణ్, నాగరాజు, సురేందర్ గౌడ్, శివ శంకర్, హరికృష్ణ గౌడ్, చందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ డాకూరి వెంకటేశం, నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుకలను అందజేస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

## కారు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

న్యాల్‌కల్, డిసెంబర్ 24: మండలంలోని అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డులో శనివారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు హద్నూర్ ఎస్‌ఐ రామనాయకుడు తెలిపారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్ గిరిజన తండాకు చెందిన భనోత్ నవీన్ (26), రాథోడ్ నర్సింగ్ (26) కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా వేగంగా, అజాగ్రత్తగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయణిస్తున్న భనోత్ నవీన్, రాథోడ్ నర్సింగ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

చౌటకూర్, డిసెంబర్ 24: బైక్ అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లిన ఘటనలో తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేశం(55) కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ పరామర్శించారు. మండల కేంద్రం చౌటకూర్ గ్రామానికి చెందిన ఆత్మకూరి మల్లేశం భార్య పుష్పలతతో నాలుగు రోజుల క్రితం బైక్‌పై శుభకార్యానికి అందోలులోని తమ బంధువుల ఇంటికి వెళ్లి చీకటిపడ్డాక అదేరోజు స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో సంగుపేట గ్రామ శివారులో 161 జాతీయ రహదారి పక్కన బైక్ అదుపుతప్పి సింగూరు కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరినీ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మల్లేశం శనివారం రాత్రి మృతిచెందాడు. మల్లేశం బీఆర్‌ఎస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చౌటకూర్‌కు వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాల ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, నాయకులు తలారి దేవయ్య, కొల్కూరి మొగులయ్య, జైన రాజ్‌వీర్, ఎండీ జాఫర్, బర్కత్‌పల్లి మల్లప్ప, మాజీ కౌన్సిలర్ గోరేమియా ఉన్నారు.

## బిలాల్‌పూర్‌లో మల్లికార్జున జాతర



కోహీర్: బిలాల్‌పూర్‌లో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

కోహీర్, డిసెంబర్ 24: మండలంలోని బిలాల్‌పూర్‌లో మల్లికార్జునస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయం ఎదుట అగ్నిగుండం ఏర్పాటు చేశారు. గొల్లబీర్ల కళాకారులతోపాటు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. నిప్పుల్లో నుంచి నడుస్తూ తమ భక్తిని చాటుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, ఉప సర్పంచ్ శైలజానర్సింహులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, మాజీ యువత అధ్యక్షుడు నాగరాజు పాటిల్, మల్లేశం తదితరులున్నారు.

## దత్తగిరిలో వైభవంగా దత్త, చండీయాగం

- అంకురార్పణ చేసిన పీఠాధిపతులు
- యాగంలో 108మంది రుత్వికులు



దత్త, చండీయాగంలో పాల్గొన్న రుత్వికులు

ఝరాసంగం, డిసెంబర్ 24 : మండలంలోని బర్దీపూర్ శ్రీదత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకు దత్త, చండీయాగం ఆశ్రమ పీఠాధిపతులు ప్రారంభించారు. దత్తగిరి క్షేత్రంలో ఆశ్రమ పీఠాధిపతులు వైరాగ్య శిఖమణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో 21 యజ్ఞ గుండంలో దత్తాత్రేయ యజ్ఞం, ఐదు యజ్ఞములతో త్యాయాహ్నిక చండీ హోమాన్ని వైదిక మంత్రాలతో శాస్త్రోత్తంగా ప్రారంభమైంది. తొలిరోజు దత్త, చండీ మహాయాగం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గురుపూజతో ప్రారంభమై గణపతి పూజ, పుణ్యావచనం, రుత్విక్ వరణం, మంటపారాధన, ఆవాహిత దేవపూజ, యంత్రపూజ, చండీపారాయణం, మహా మంగళహారతి, యోగినిబలి కార్యక్రమాలు కొనసాగాయి. యాగానికి 200మంది దంపతులు హాజరయ్యారు. దత్త, చండీ హోమానికి హైదరాబాద్‌కు చెందిన పరమేశ్వర శాస్త్రి, కుప్పానగర్ గ్రామానికి చెందిన శివశంకర్‌స్వామి, చిన్న శంకరంపేటకు చెందిన శివశక్తి సారధ్యం వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. యాగం మూడు రోజుల పాటు కొనసాగనున్నది.

## అభివృద్ధికి కేరాఫ్ తెలంగాణ



కేటీఆర్ ప్రసంగాన్ని టీవీలో వీక్షిస్తున్న ఆనంద్ రావు

మునిపల్లి, డిసెంబర్ 24: కాంగ్రెసోళ్లు కండ్లు సరిగ్గా కడుక్కొని బీఆర్‌ఎస్ విడుదల చేసిన స్వేదపత్రాన్ని చూడాలని బీఆర్‌ఎస్ మునిపల్లి మండల యువత విభాగం అధ్యక్షుడు ఆనంద్‌రావు అన్నారు. ఆదివారం మునిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణను తీర్చిదిద్దిందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ విడుదల చేసిన స్వేదపత్రం కేసీఆర్ సర్కార్ హయాంలో జరిగిన అభివృద్ధికి కండ్లకు కట్టినట్లు చూపారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు మాని, ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

## మల్గి మల్లన్నకు ప్రత్యేక పూజలు

న్యాల్‌కల్, డిసెంబర్ 24: మండలంలోని మల్గి గ్రామ శివారులో మల్లికార్జున స్వామి జాతర సందడిగా మారింది. ఆదివారం గ్రామ శివారులోని మల్లికార్జున స్వామివారికి భక్తులు దర్శనాలు, పూజలు అభిషేకం, బిల్వార్చన, హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. మల్గితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

## రాములోరి అక్షింతల శోభాయాత్ర



సదాశివపేటలో అయోధ్య రాముడి అక్షింతలను శోభాయాత్రగా తీసుకెళ్తున్న భక్తులు

సదాశివపేట/హత్నూర/గుమ్మడిదల, డిసెంబర్ 24: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతల శోభయాత్రను ఆదివారం సదాశివపేటలోని శ్రీరామ కళామందిరం నుంచి ఘనంగా నిర్వహించారు. అక్షింతలకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య రాముడి అక్షింతలను హత్నూర గ్రామ శివారులోని హనుమాన్ ఆలయం నుంచి శివాలయం వరకు భక్తులు భజన సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గడపగడపకూ అక్షింతలు అందజేశారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఆలయకమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భక్తులు పురవీధుల గుండా అయోధ్య రామయ్య అక్షింతలను ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు.

## ఘనంగా దత్త జయంతి

సదాశివపేట, డిసెంబర్ 24: పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిరంలో దత్త జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిమామిడి రాజు దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వార్డు కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి మాణిక్‌రావు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సజ్జాపూర్‌లో ఘనంగా బోనాలు

కోహీర్, డిసెంబర్ 24: మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో పునఃనిర్మించిన దుర్గాభవాని, మైసమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలతో పూజలకు శ్రీకారం చుట్టారు. అనంతరం అందంగా అలంకరించిన బోనాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవతామూర్తులకు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, నర్సింహులు, పాండురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సజ్జాపూర్‌లో అమ్మ వారి ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

## క్రిస్మస్‌కు చర్చీలు ముస్తాబు

***క్రిస్మస్‌ను పురస్కరించుకొని చర్చీలు ముస్తాబయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి పండుగ సంబురాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు తమ ఇండ్లపై రకరకాల స్టార్స్‌ను వేలాడదీశారు. వైవిధ్య అలంకరణలు, విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్ దుస్తులు, బెలూన్లతో చర్చీలు, ఇండ్లు కొత్త శోభను సంతరించుకున్నాయి.***

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్*



జహీరాబాద్‌లో విద్యుత్‌కాంతుల్లో చర్చి





మునిపల్లి: విద్యుత్ దీపాల అలంకరణలో చర్చిలు



కోహీర్: కవేలి చర్చి



నాగల్‌గిద్ద: వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రామచంద్రాపురం: భారతీనగర్ ఎల్‌ఐజీలో కేకుల పంపిణీ